నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 | శుక్రవారం 29 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


## జనగామ ఏసీపీపై
# ఈసీ బదిలీ వేటు



ఈసీ బదిలీ వేటుకు గురైన జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, మార్చి 28 : జనగామ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దామోదర్‌రెడ్డిపై ఎన్నికల సంఘం(ఈసీ) బదిలీ వేటు వేసింది. వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆయనకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల పెంబర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఏసీపీ దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఇదే సమయంలో జనగామ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తిరుగు ప్రయాణంలో సమీపంలో ఉన్న టీ స్టాల్ వద్ద ఆగి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లతో కలిసి టీ తాగుతుండగా ఆ ఏరియాలోని ఫుట్‌పాత్‌పై పండ్లు, కూరగాయలు విక్రయించుకునే చిరు వ్యాపారులు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేసి, ఉన్నత స్థాయి అధికారులతో స్థానిక అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎమ్మెల్యే పల్లా ఎలక్షన్ వయోలేషన్‌కు పాల్పడ్డారని ఎఫ్ఐఆర్ నమోదుకు తహసీల్దార్ ద్వారా ఉత్తర్వులు జారీ చేయించారు. దీంతో చిరు వ్యాపారుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యేగా వినడం ఎలక్షన్ వయోలేషన్ కిందకు వస్తే, పెంబర్తిలో ఓ కాంగ్రెస్ నాయకుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ పార్టీ శ్రేణులు, అధికారులు కలిసి ప్రారంభించడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు రాదా? అని ఎమ్మెల్యే పల్లా 'నమస్తే తెలంగాణ' ద్వారా ప్రశ్నించారు. అనంతరం పలు దినపత్రికల్లో వచ్చిన వార్తా కథనాల ఆధారాలతో పాటు లిఖిత పూర్వకంగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన ఎన్నికల సంఘం ఏసీపీ దామోదర్‌రెడ్డిపై బదిలీ వేటు వేసింది. కాగా, ఫిబ్రవరిలోనే ఏసీపీగా విధుల్లో చేరిన దామోదర్‌రెడ్డి కేవలం నెలన్నర వ్యవధిలో బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అతి త్వరలోనే జనగామకు మరో కొత్త ఏసీపీని డీజీపీ నియమించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.



మొగుళ్లపల్లి మండలం కాసులపాడు గ్రామ శివారులో సాగునీరందక ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

# సాగునీరివ్వడంలో కాంగ్రెస్ విఫలం

## మూడు నెలల పాలనలోనే ముప్పుతిప్పలు

- పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- మొగుళ్లపల్లి మండలం కాసులపాడులో పంటల పరిశీలన

చిట్యాల (మొగుళ్లపల్లి), మార్చి 28 : 'కాంగ్రెస్ ఎన్నికల ముందు చెప్పినవన్నీ అబద్ధాలే. అంతా మోసమే. దొంగ హామీలతో రైతులను ముంచి గద్దెనెక్కింది. సాగు నీటి నిర్వహణలో ఘోరంగా విఫలమై, పంటలు ఎండబెడుతూ రైతన్న పొట్టకొడుతున్నది' అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. గురువారం మొగుళ్లపల్లి మండలం కాసులపాడు గ్రామ శివారులో సాగునీరందక ఎండిపోయిన వరి పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందు రైతులు ఎలాంటి గోసలుపడ్డారో ఇప్పుడు మళ్లీ అదే దుస్థితి పునరావృతం అవుతున్నదన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఏనాడూ సాగునీటి కష్టాలు లేవని, ఎక్కడా ఎకరం కూడా ఎండనివ్వకుండా నీరందించినట్లు చెప్పారు. పంటలు బాగా పండాయని, సాగు బంగారమైందని చెప్పారు. కానీ, కాంగ్రెస్ మూడు నెలల పాలనలో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగానికి యాసంగి పంటలకు నీరందించే సోయి లేదని విమర్శించారు. నష్టపోయిన రైతులు మనోధైర్యం కోల్పోవద్దన్నారు. గ్రామ శివారులో 100 ఎకరాలు సాగు చేయగా 25 ఎకరాలు సాగునీరు అందక ఎండిపోయిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహా రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్గురి తిరుపతిరావు, నాయకులు రమేశ్, రైతులు కోడెపాక కొమురయ్య, ఐలయ్య, దాసరి ప్రకాశ్‌రెడ్డి, చిగురుమామిడి చిన్నరవి, ఈశ్వరయ్య, భద్రయ్య, పెద్ద రాజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

వరంగల్, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఎమిమిది జాబితాలు విడుదల చేసినా.. అందులో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఎవరనేది కాంగ్రెస్ తేల్చలేదు. ఈ స్థానంకోసం ఎవరికివారుగా ఆశావహులు ఒక్కో ముఖ్యనేత అండదండలతో తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తుండడంతో అధిష్టానానికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. అధికార పార్టీ అన్ని పార్టీలకంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, ఇక్కడ విరుద్ధంగా ఉండడం ఆ పార్టీలో 'ఆధిపత్య'పోరును బహిర్గతం చేస్తున్నది.



## వరంగల్ పార్లమెంట్ సీటుపై ఇంకా రిక్త'హస్తం'

## ఎనిమిదో జాబితాలోనూ



# ఎవరనేది లేదు..

### అవకాశం ఎవరికో తేలక ఆశావహుల ఆగమాగం.. ఒక్కొక్కరికి ఒక్కో ముఖ్యనేత అండదండలు

### వర్గాలుగా విడిపోయి అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు.. టికెట్‌పై ఎటూ తేల్చక అధిష్టానానికి తలపోటు

కాంగ్రెస్ పార్టీలో వరంగల్ లోక్‌సభ టికెట్ పంచాయితీ ఎంతకీ తెగడం లేదు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ తాజాగా ఎనిమిదో జాబితా విడుదల చేసింది. ఇప్పటి వరకు 209 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిని మాత్రం ఖరారు చేయలేదు. తెలంగాణలోని మొత్తం 17 సీట్లలో 13 చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. సాధారణంగా ఎన్నికల పోరు వ్యూహంలో అధికార పార్టీ ముందుంటుంది. ప్రతిపక్షాల కంటే ముందుగా కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండేది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతున్నది. బీఆర్ఎస్ కడియం కావ్యను, బీజేపీ అరూరి రమేశ్‌ను ఇప్పటికే తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. కాంగ్రెస్ ముఖ్యనేతల మధ్య సయోధ్య లేకపోవడంతో వరంగల్ ఎంపీ టికెట్ వ్యవహారం కొలిక్కి రావడంలేదు. కాంగ్రెస్‌లో వరంగల్ టికెట్ పంచాయితీ తీవ్రమవుతున్నది. కొత్తగా చేరిన వారు, పార్టీలోని పాత వారి మధ్య పోరు ముదురుతున్నది. ఈ పార్టీలోని రాష్ట్ర స్థాయి ముఖ్యనేతలు ఒక్కొక్కరు ఒకరికి మద్దతు ఇస్తున్నారు. దీంతో వరంగల్ ఎంపీ టికెట్ కేటాయింపు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ లోక్‌సభ టికెట్ కోసం ఏడుగురు నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎవరికివారు టికెట్ తమకే అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, శనిగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య, రామగల్ల పరమేశ్వర్, బక్క జడ్సన్, జన్ను పరంజ్యోతి, నమిండ్ల శ్రీనివాస్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. వీరందరూ తలా ఒక పెద్ద నేత దీవెనలతో ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా మంత్రి ఇలా నలుగురు ముఖ్యులు తమ సన్నిహితులకు టికెట్ ఇప్పించేందుకు ఏఐసీసీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కేటాయింపు వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్‌లోని ముఖ్య ప్రజాప్రతినిధులకు ఆధిపత్య పోరులాగా మారింది.

వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ స్థాయిలో టికెట్‌పై హామీతోనే పసునూరి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిసింది. ఢిల్లీలోని పరిచయాలతో పసునూరి దయాకర్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన తనకు కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంగ్రెస్ అధిష్టానం వరంగల్ అభ్యర్థిత్వం కోసం పసునూరి పేరును పరిశీలించడంపై ఆ పార్టీ పాత నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శనిగపురం ఇందిర వరంగల్ ఎంపీ సీటు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఇందిర 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇందిరకు కర్ణాటకలో వ్యాపారాలు ఉన్నాయి. వరంగల్ ఎంపీ సీటు కోసం ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ప్రయత్నాలు చేయిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ రాష్ట్రంలో రెండు చొప్పున సీట్లను మహిళలకు కేటాయించాయని, ఇదే ఫార్ములాతో తనకూ అవకాశం వస్తుందని ఆమె చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దొమ్మాటి సాంబయ్య టికెట్‌పై ధీమాతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడిగా సాంబయ్యకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రేవంత్‌రెడ్డితోనే సాంబయ్య కాంగ్రెస్‌లో చేరారు. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. అప్పుడు పార్టీ తరఫున పోటీ చేసిన తనకు రెండోసారి అవకాశం వస్తుందని నమ్మకంతో ఉన్నారు. రామగల్ల పరమేశ్వర్ వరంగల్ ఎంపీ కోసం ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ సీటు ఆశిస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉన్న తనకు ఏఐసీసీ ఎంపీ టికెట్ ఇస్తుందని చెబుతున్నారు. వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం లో పార్టీ కోసం పనిచేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. శ్రీనివాస్‌కు అవకాశం ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సెగ్మెంట్‌లో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అవకాశం ఇచ్చారని, ఇప్పుడు తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన జన్ను పరంజ్యోతి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మంత్రి అండదండలతో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. వర్ధన్నపేట అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన పరంజ్యోతి ఎంపీ సీటు వస్తుందని నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ సీటు కోసం పోటీ ఎక్కువగా ఉండడంతో టికెట్ రాని వారు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉన్నదని పార్టీ హైకమాండ్ ఆందోళనతో ఉన్నది. టికెట్ దక్కని వారిని బుజ్జగించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నది. ఎక్కువ మంది నేతలు మాత్రం టికెట్ కోసమే పట్టుబడుతున్నారు. వరంగల్ అభ్యర్థి ఖరారైన తర్వాత కాంగ్రెస్‌లో అసలైన రాజకీయాలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.

# రియల్ విలవిల



ములుగు జిల్లా కేంద్రంలో సిద్ధం చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్

- ప్రభుత్వం మారడంతో తగ్గిన డిమాండ్
- ప్లాట్లు కొనేవారులేక రియల్టర్ల ఇబ్బందులు
- మున్సిపాలిటీ ఏర్పాటు అనుమానాలతో వెనుకంజ
- నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు

ములుగు, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ప్లాట్లు కొనేవారు లేక ములుగు జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో ములుగు జిల్లాగా ఏర్పడిన తర్వాత చుట్టపక్కల గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగింది. కానీ, మూడు నెలల కాలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ములుగు జిల్లా కేంద్రంతో పాటు మల్లంపల్లి, జంగాలపల్లి గ్రామాలతో పాటు వెంకటాపూర్ మరి కొన్ని మేజర్ గ్రామపంచాయతీల్లో రియల్ జోరు నడిచింది. భూములు కొనేవారు తక్కువ కావడంతో పెద్ద ఎత్తున వెలుస్తున్న వెంచర్లలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్లాట్లకు సరైన ధర లభించకపోవడంతో స్థిరాస్తి వ్యాపారం మందగించింది. గ్రామ పంచాయతీగా ఉన్న ములుగును మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.. పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగిసిన వెంటనే మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని బిల్లును పాస్ చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు మారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మున్సిపాలిటీ కళ ఎప్పుడు నెరవేరుతుందోననే అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. దీంతో కొనుగోలు చేసిన వెంచర్లలో ప్లాట్లకు రేట్లు పెరుగకపోవడం, గతంలో కొన్న వారికి సరైన రేట్లు రాకపోవడంతో బిజినెస్ మొత్తం డీలా పడింది. ములుగు జిల్లా కేంద్రంలో ఎక్కడ వెంచర్ చేసినా రోజుల వ్యవధిలోనే ప్లాట్లు అమ్ముడుపోయేవి. నేడు భూములను కొనే వారు లేక రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తగిన లాభాలు రాకపోవడంతో నూతన వెంచర్‌లు ఏర్పాటు చేయడంలేదు. గ్రామ పంచాయతీగా ఉన్న ములుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటే మున్సిపాలిటీ నిబంధనలు అమలు చేయాల్సి ఉంది. దీంతో వ్యాపారులకు కూడా పెట్టుబడులు పెరుగడంతో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి తగ్గింపు ధరల్లో ప్లాట్లు విక్రయించలేని పరిస్థితి ఉంది. అక్కడక్కడ వెంచర్లు చేస్తున్నా కొనుగోలు చేసే వారు లేక పెట్టుబడి పెట్టిన రియల్టర్లు ఆందోళన చెందుతున్నారు. కొందరు పెట్టిన పెట్టుబడి వచ్చినా సరిపోతుందనే ఉద్దేశంతో విక్రయాలు జరుపుతుండగా, మరికొందరు సరైన లాభాలు రావడం లేదని అలాగే ఉంచుకుంటున్నారు. వ్యాపారం తగ్గడంతో పాటు కొత్తగా భూములు కొనుగోలు చేసే వారు లేక పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేక వ్యాపారులు విలవిలలాడుతున్నారు. చేసేది ఏమీలేక దళారులకు కమీషన్లు ఇచ్చి తక్కువ ధరలకే ప్లాట్లను విక్రయిస్తున్నారు. అయినప్పటికీ కొనే వారు లేక రియల్ ఎస్టేట్ వ్యాపారం దివాళా తీసే స్థాయికి చేరింది. మున్సిపాలిటీ ఏర్పాటు చేసినట్లయితే భూముల రేట్లు మరింత పెరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారం లాభాల బాట పట్టేదని పలువురు వ్యాపారులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





## లైసెన్స్ తుపాకులను అప్పగించాలి

**లేకపోతే చర్యలు తప్పవు**

**సీపీ అంబర్ కిశోర్ ఝా**

సుబేదారి, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ తుపాకులు తీసుకున్న వారు వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో అందజేయాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయుధాల చట్టాన్ని అనుసరించి ప్రభుత్వ అనుమతితో తుపాకులు తీసుకున్నవారు అప్పగించాలని సూచించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 201మందికి తుపాకులు ఇచ్చారని, వీరిలో హనుమకొండ జిల్లాలో 131మంది, వరంగల్ జిల్లా 52మంది, జనగామ జిల్లాలో 18మంది ఉన్నారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తిరిగి అందజేస్తామని సీపీ పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందన్నారు.

# అగ్నికీలల్లో జకోటియా కాంప్లెక్స్

- ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్
- కాంప్లెక్స్ మొత్తం వ్యాపించిన మంటలు.. అగ్నికి ఆహుతైన రిలయన్స్ షాపింగ్ మాల్స్



పోచమ్మమైదాన్‌లో జరిగిన అగ్ని ప్రమాద దృశ్యాలు





పోచమ్మమైదాన్, మార్చి 28: వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాంప్లెక్స్ మొత్తం అంటుకుంది. వరంగల్ ఫైర్ స్టేషన్ నుంచి మూడు ఫైరింజన్లు వచ్చినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. పోచమ్మమైదాన్ నుంచి కాశీబుగ్గ రహదారిలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. జకోటియా కాంప్లెక్స్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఫర్నిచర్, కంప్యూటర్లు, ఏసీలు ఇతర పరికరాలు అంటుకొని మంటలు మరింత వ్యాపించాయి. ఆ సమయంలో 20 మంది మంటలు ఆర్పేందుకు సేఫ్టీ పరికరం ద్వారా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే వారు కార్యాలయం నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. హనుమకొండ నుంచి మరో రెండు ఫైరింజన్లు తెప్పించి ప్రయత్నించినా మంటలు తగ్గకపోగా, కింది ఫ్లోర్‌లో ఉన్న రిలయన్స్ డిజిటల్‌కు వ్యాపించాయి. ఇందులో ఉన్న కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. ప్రమాదంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు రూ. 50లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తున్నది. రిలయన్స్ డిజిటల్‌కు కూడా లక్షల్లో నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోచమ్మమైదాన్ సెంటర్ సమీపంలోనే ప్రమాదం జరగడం వల్ల ప్రజలు పెద్ద ఎత్తున పోగయ్యారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ఇరువైపులా రాకపోకలను నిలిపి వేసి వాహనాలను ఆటోనగర్ మీదుగా పంపించారు. రాత్రి 10.30 గంటల వరకు మంటలు అదుపులోకి వచ్చాయి. ఆస్తి నష్టం అంచనా వేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి తెలిపారు.



అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

### సీఐకి అస్వస్థత.. కానిస్టేబుల్‌కు గాయాలు

మంటలు ఆర్పే క్రమంలో మట్టెవాడ సీఐ తుమ్మ గోపి ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యారు, ఫైర్ హోంగార్డు గిరి చేయి కాలిపోగా ఇద్దరినీ 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు.

## పోలీస్ అధికారులు ప్రజలకు
# అందుబాటులో ఉండాలి

- చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించండి
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయండి
- మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్

భూపాలపల్లి రూరల్, మార్చి 28: ప్రజలకు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని కాళేశ్వరం మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, నేర సమీక్షపై ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా ఉండాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని, ల్యాండ్, సివిల్ కేసుల్లో ఎస్ఓపీ ప్రకారం పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. ఓల్డ్ పెండింగ్ కేసుల ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తి చేయాలని, లాంగ్ పెండింగ్ కేసులపై రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే జిల్లా భౌగోళిక పరిస్థితి, అసెంబ్లీ నియోజక వర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గ పరిధి, పోలింగ్ లోకేషన్లు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, జిల్లాలో ఉన్న ఓటర్లు, ఎన్నికల సందర్భంగా సెక్యూరిటీ ప్లాన్, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐజీకి వివరించారు. సమావేశంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, సీఐలు నరేశ్‌కుమార్, మల్లేశ్, రాజేశ్వర్‌రావు, సాగార్జునరావు, వసంతకుమార్, రామకృష్ణ, రవీందర్, నగేశ్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, ఎస్సైలు పాల్గొన్నారు.